1985 రక్షాక్షి సంక్రాంతి కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన రచన

# అగ్నిసరస్సు

పాపినేని శివశంకర్

**నేనెంత నిస్సహాయుణ్ణయ్యాను? ఎంత దారుణ శూన్యంలో నిలబడ్డాను? కాలి కింద నేల కరిగిపోతున్న స్థితి. ఎటు చూసినా చేయూత లేని ఏకాకి తనం.**

**కాలి కింద ఆధారం కంపిస్తున్న వాడికే భీభత్సం అంటే ఏమిటో తెలుస్తుంది. జీవితం నరకయాతన అయిన వాడికే మరణించే గుండెల చప్పుడు విన్పిస్తుంది. ఆధారం లేనివాడికి జీవితం వుందంటే నేను నమ్మను. నేను అవిశ్వాసిని. అందుకు నేను విచారపడటం లేదు.**

నా చేతిలో డాక్టరు రిపోర్టు కాగితం రెపరెప లాడుతోంది. నా ఒకే ఒక్క కూతురు ప్రశాంతికి మూత్ర పిండాల జబ్బేదో వుందని రిపోర్టు సారాంశం. ఖరీదైన జబ్బుకి ఖరీదైన వైద్యం చేయించాలంటే మద్రాసు వెళ్లాలి. అందుకు డబ్బెంతో కావాలి. ఎక్కణ్నుంచి వస్తుంది అంత డబ్బు? అంతో ఇంతో డబ్బు తెచ్చిపెట్టే వుద్యోగాన్ని కోల్పోయాను... లేదు. నేను కోల్పోలేదు. ఉద్యోగమే నన్ను కోల్పోయింది.

డాక్టర్ రిపోర్టుతో ఇల్లు చేరాను. ఇల్లంతా శ్మశానంలా నిశ్శబ్దంగా వుంది. ప్రశాంతి ప్రశాంతంగా నిద్రపోతోంది. ఒళ్ళు లావెక్కి, మొహం పాలిపోయి ఏదోలా వుంది. కళ్లల్లో ఆ తేజస్సు, మొహంలో ఆ వికాసం ఏమైపోయాయి? నన్ను చూసి వసంత ఎదురొచ్చింది. ఆమె కళ్ళల్లో ప్రశ్నార్థకం. తెలీని ఆందోళన. క్షణం నిశ్శబ్దం.

"ఏమన్నాడండీ డాక్టరు?"

చెప్పాను. వసంత వణికి పోయింది. కళ్ళల్లో గిర్రున నీరు తిరిగింది.

"ఇప్పుడెలాగండీ? అంత డబ్బెలా వస్తుంది?"

అదే నాకూ సమాధానం దొరకని ప్రశ్న. తాకట్టు పెట్టడానికి ఇంట్లోనూ వసంత మెడలోనూ ఏ వస్తువూ మిగల్లేదు. కానీ ఏదో సమాధానం చెప్పాలి. ఏం చెప్పగలను? ఎంత జవాబు దొరకని వ్యక్తినయ్యాను?

"మాట్లాడరేమండీ?"

"ఏం మాట్లాడ మంటావు?"

"ఎలాగైనా అప్పో సప్పో చేసి పాపను మద్రాసు తీసుకెళదాం."

"ఆ ప్రయత్నమూ అయింది. వాళ్లనీ వీళ్లనీ అడిగి లేదనిపించుకున్నాను."

"పట్టుదలకి పోయి వుద్యోగం పోగొట్టుకున్నారు. అందరికీ లేని పట్టింపులు మీకే కావలసి వచ్చాయి. ఇప్పటికైనా ఆలోచించండి. కాళ్ళో గడ్డమో పట్టుకుని వుద్యోగం నిలబడేలా చూసుకోండి."

"ఆ పరిస్థితి దాటిపోయింది వసంతా. వాళ్ళు నా మీద పగ బట్టారు. నమ్మిన విలువలకి కట్టుబడటమే నేను చేసిన నేరం. ఫలితం ఇది."

"కోర్టులో గెలుస్తారా?"

"ఏమో. ఒకసారి గెలిచినా తాత్కాలికంగా వుద్యోగంలో చేర్చుకుని మళ్ళీ కొత్త ఆరోపణల మీద తీసేశారు గదా. ఇక ఇదెప్పటికి తేలుతుందో. బహుశా ఇక వుద్యోగం రాదేమో."

వసంత నిశ్శబ్దంగా ఏడుస్తోంది. నేనూ లోలోపల ఏడుస్తున్నాను. నా కూతురు కోసం. ప్రాణానికి ప్రాణమైన నా కూతురు కోసం.

** ** ** **

నేరాలు దుర్మార్గులే చేస్తారు. నేను దుర్మార్గుణ్ణి కాను. నేరం చెయ్యని వాణ్ణి నేరస్థుడుగా చూపడానికి సమాజంలో ఎన్నో మార్గాలున్నాయి. సమాజ గమనంతో నిమిత్తం లేని కరుడు గట్టిన ఒకానొక విద్యా సంస్థలో నా వుద్యోగం. ఆ వుద్యోగం సంపాదించడానికి, కేవలం పశువులతో సమానంగా తిండి సంపాదించడానికి ఎన్ని కష్టాలు పడ్డాను? ఏ మనిషి బతుకు తెరువుకీ పనికిరాని ఖరీదైన చదువులు చదవడానికి తల్లిదండ్రులు కూడబెట్టిన నాలుగెకరాల కొండ్ర ఆవిరై పోయింది. ఒంటి పూట తిండి తిని, వారాలుచేసి పడిన కష్టానికి కాగితపు డిగ్రీ చేతి కొచ్చింది. కర్తవ్యం ముగిసిన తల్లి దండ్రులు దరిద్రంలోనే చచ్చి పోయారు. కడుపు దహించుకుపోయే ఆకలితో నాలుగు సంవత్సరాల వుద్యోగాన్వేషణ. తీరని తృష్ణతో చదివి సమాజానికేదో ఒరగబెడదామనుకున్న వాడికి బతుకు తెరు వెందుకు లభించదో మనుషుల వేషంలో వున్న పశువులకు తరతరాలు తిన్నా తరగని సంపదెందుకు పోగుపడుతుందో నాకర్థం కాలేదు. అయితే నా సహనం అంతరించే దశలో ఆ వుద్యోగం నాకు దక్కింది. తలవని తలంపుగా. డబ్బులతో పలుకుబడితో పోటీపడ్డ అభ్యర్థుల్లో ఎవరికి వుద్యోగం ఇవ్వాలో తెల్చుకోలేని సందిగ్ధ పరిస్థితిలో అధికారులు మార్కులు తప్ప ఆ అర్హతలు లేని నాకు ప్రసాదించారు. గమ్మత్తులు కలల్లోనే కాదు, వాస్తవం లోనూ జరుగుతాయి.

ఉద్యోగం చేసేవాడికి ఉద్యోగ నియమాల కంటే దాని వెలుపల నియమాలే ఎక్కువనీ వాటినే ముఖ్యంగా పాటించాలనీ నేను తెలుసుకోలేదు. పాలకవర్గాల కనుసన్నల్లో మెలుగుతూ వారి పల్లకి మొయ్యాలనీ అందుకు ఆత్మ గౌరవాన్ని ముడుపుగా చెల్లించాలనీ నేను తెలుసుకోలేదు. ఫలితం ఘర్షణ. సంవత్సరం తిరిగేసరికి విధి నిర్వహణలో లోపం వుందనే ఆరోపణ. సాక్ష్యాధారాలతో సహా రుజువై వుద్యోగం వూడినప్పుడు నేను దిమ్మెర పోయాను. తప్పు చెయ్యకుండానే దుర్మార్గుడినయ్యాను.

దుర్మార్గులకే కాదు, అమాయకులకు సైతం న్యాయం కోసం అర్థించడానికి ఎన్నో అవకాశాలున్నాయి. ఆ అవకాశంతోనే పై అధికారులకు ఫిర్యాదుచేశాను. మూడు నెలల తర్వాత విచారణ. ఫలితం సంవత్సరానికి వెలువడింది. నేను నిర్దోషిని అవునో కాదో విచారణ తేల్చలేదు కానీ వుద్యోగం నుంచి తీసివేయడంలో ముందుగా పై అధికారుల్ని సంప్రదించకపోవడమే రూల్సుకి వ్యతిరేకంగా కన్పించింది. ఆ కారణంగా నన్ను తిరిగి చేర్చుకోవాల్సిందిగా ఆదేశించడం జరిగింది. కానీ ఆదేశం నీటిబుడగ పాలైంది. సత్తావున్న వాడు ఏ ఆదేశాలనీ నీతినీ పాటించకుండానే నెగ్గుకు రావచ్చని ఆలస్యంగా తెలిసింది నాకు. మళ్ళీ ఫిర్యాదు. మళ్ళీ ఆదేశం. ఫలితం శూన్యం. ఆదేశం వుల్లంఘించిన వాళ్ళపై అధికారులు చర్య తీసుకోవాలనే నా అవగాహన చెప్పింది కానీ రెండు వర్గాలూ లాలూచీపడి

న్యాయానికి అన్యాయం చెయ్యగలరని నేనూహించలేదు. డబ్బూ పలుకుబడి లేని వాడికి బ్యూరోక్రసీలో చిల్లిగవ్వ విలువ లేదనీ, దాని దృష్టిలో మనిషికి ఆర్థిక వెల మాత్రమే వుందనీ ఆలస్యంగా గ్రహించాను.

ఎవరికి మొర పెట్టుకోవాలి? నేను ఆకలి బాధ పడుతున్నాననీ, ఉనికి సమస్య నెదుర్కొంటున్నాననీ, నా ప్రశాంతిని కాపాడుకోలేక పోతున్నాననీ, ఎవరికి చెప్పుకోవాలి. దిక్కులేని వాడికి ఇక్కడ న్యాయస్థానమే దిక్కు. నేను న్యాయ




స్థానానికి మొరపెట్టుకున్నాను. తల తాకట్టు పెట్టి ఫీజులు చెల్లించి న్యాయ స్థానం మెట్లెక్కాను. మెట్లెక్కడమే కాదు, దిగడమూ కష్టమే. నాతోపాటు కోర్టు తీర్పు మెట్లు దిగి రావడానికి మూడేళ్ళు పట్టింది. ఈ మూడేళ్ళ నా జీవితం నరకం. అనారోగ్యం. అప్పులు. అవమానాలు. నేను కొట్లలో గుమస్తాగా పద్దులే రాశానో నాభార్య నాకోసం వ్యభిచారం తప్ప దొరికిన పనులన్నీ ఎలా చేసిందో వివరించడం

## చిటుకులు

### అరంగేట్రం కాల్

వాళ్లమ్మాయి పాట మొదటిసారి వస్తోందని
రేడియో పెట్టుక్కూచున్నారు అంతా విందామని
అప్పుడే ట్రంకాల్ రావటం ఏం ఆరిపోయిందని?
అరవటంతో సరి - ఆ కాసేపూ, 'అలో', అలో' అని

—భండారు పర్వతాలరావు

అనవసరం.

నాది న్యాయమేనని కోర్టు తీర్పిచ్చింది. తీర్పునుసరించి సంస్థ పాలకవర్గం నన్ను ఉద్యోగంలోకి తీసుకుంది. కానీ నెల తిరక్క ముందే సరికొత్త ఆరోపణల మీద మళ్ళీ బయటికి నెట్టింది. ఈ పగ సాధింపుకి జవాబు న్యాయస్థానంలో లేదని నాకు తెలుసు. అయినా ఎందుకో పట్టుదల. ఘర్షణతో మళ్ళీ కోర్టు కెక్కాను—వసంత మెడలో తాళిబొట్టు తెగనమ్మి. వసంత నన్ను వారించలేదు. లోలోపల కుళ్ళిపోయింది బాధతో. ఆమె సామాన్యమైన అసామాన్య స్త్రీ. అందుకే వసంత అంటే నా కెంతో యిష్టం.

రెండేళ్ళుగా నేను శూన్యంలో నిలబడ్డాను. కాలికింద నేల లేదు. కళ్ళ ముందు గమ్యం లేదు. అయినా ఎందుకు బతుకుతున్నాను? ఏమో నాకు తెలీదు.

** ** ** **

పక్క వాటాలో వున్నట్టుండి పెద్ద రభస మొదలైంది. ఎప్పుడూ వుండేదే. అతనేదో ప్రైవేట్ కంపెనీలో గుమస్తా ఉద్యోగం చేస్తున్నాడు. జీవితం నెంబారుగా సాగిపోవడానికి, నత్తలా నడవడానికి చాలీ చాలని ఎదుగూ బొదుగూ లేని సంపాదన. ఎదిగిన కూతుళ్ళ పెళ్ళిళ్ళు చెయ్యాలి. గత నెలలో చేసిన అప్పులు తీర్చాలి. రాబోయే జీతం కోసం పదోతారీకునుంచే ఎదురు చూడాలి. రాని ప్రమోషన్ కోసం ఉదయం ఎనిమిది నుంచి రాత్రి ఎనిమిది గంటల దాకా చాకిరీ చెయ్యాలి. ఎప్పుడు చూసినా అతనేదో ఎప్పటికీ దించలేని బరువు మోస్తున్నట్టు కనిపిస్తాడు. నీళ్ళలో నడుస్తున్నట్టు, ఊపిరాడనట్టు, చివరి శ్వాస విడుస్తున్నట్టు కనిపిస్తాడు.

అద్దెకు దిగిన కొత్తలో అతను కనిపించినప్పుడు పరిచయపూర్వకంగా నవ్వాను. అతను నవ్వలేదు. లోకంలోని కోట్ల ప్రాణుల్లో నన్నూ ఒకడిగా చూస్తూ వెళ్ళిపోయాడు. ఎప్పుడెదురైనా అంతే. రానురాను నేనూ అతను కనిపిస్తే నవ్వడం మానేశాను. ఇప్పుడు కావాలనుకున్నా నాకు నవ్వు రాదు. ఇద్దరం ఎదురుపడితే అతి మామూలుగా ఒకరినొకరం చూసుకుంటూ దాటి పోతాం.

అతను పెళ్ళాన్ని బండ బూతులు తిడుతున్నాడు. కొడుతున్నాడు. ఆమె కేకలు పెట్టి ఏడుస్తోంది. బహుశా ఏదో క్రూరతతో కొడుతుండాలి. బాగా తాగి వుండాలి. తాగనప్పుడు అతను భార్యను కొట్టడు. జీవితాంతం ఒకచోట కలిసి పని చెయ్యవలసిన యంత్రంలా భార్యని చూస్తాడు. ఏడుస్తున్న కూతుళ్ళ ఎక్కిళ్ళు కూడా వినిపిస్తున్నాయి. రెండు వాటాలకీ మధ్య సన్నటి చెక్క మాత్రమే అడ్డు. చెక్కకి ఆనుకుని నా పాతబడ్డ పడక్కుర్చీ. అందులో కూర్చుని వింటున్నాను. వసంత పని చేసుకుంటోంది. లెక్క పెట్టాను. పది... పదిహేను.... ఇరవై రెండు దెబ్బలు ఫెడీ ఫెడీ మంటూ.

దెబ్బల మోత ఆగిపోయింది. అతను అలిసిపోయి వుండాలి. ఇరవై రెండు దెబ్బలే ఎందుకు కొట్టాలి? అంతకెక్కువో తక్కువో ఎందుకు కొట్టలేదు? నిజానికతను భార్యనే కొడుతున్నాడా? తననే హింసించుకుంటున్నాడా? ఏమో. నాకవసరంలేదు. ఎన్ని దెబ్బలు కొడితేనేం? ఎవరిని కొడితేనేం? నిజానికి ఆ దెబ్బలు ఎవరో నన్నే కొడుతున్నట్టుంది. ఇంకా కొడితే బాగుండును. దెబ్బ మీద దెబ్బ తినడంలో ఎంత దారుణమైన హాయి వుంది?

పడక్కుర్చీలో వెనక్కి జార్లపడి కళ్ళు మూసుకున్నాను. తల వెనక చూసిన తలగడ వాసనేస్తోంది. ఆ వాసన నాకెంతో యిష్టం. అది పీలుస్తూ కళ్లు మూసుకుంటే నేను నా బాల్యపు పొరల్లోకి వెళ్ళిపోతాను. అలా నిస్పృహయంగా దేనిలోకో జారిపోవడం ఇష్టమనిపిస్తోంది. ఆ సమయంలో ఏ ఇంటివాడో వచ్చి తలుపు తట్టి అద్దె కోసం నా తృప్తికి భంగం కలిగించి నప్పుడే ఎక్కడ లేని ద్వేషం పుట్టుకొస్తుంది.

ఈ ప్రపంచంలో కాలికింద డబ్బు పునాది లేకపోవడమంటే ఏమిటో నాకు తెలిసినట్టు, డబ్బు కలిగి వుండటమంటే ఏమిటో మా యింటి యజమానికి తెలుసు. ఎండకీ వానకీ ఆగని గుడిసెలూ, పేవ్‌మెంట్ గుడారాలూ, గాలీ వెలుతురూ లేక బయటి లోకంతో సంబంధం లేని అగ్గిపెట్టెల్లాంటి మురికి కొంపలూ వున్న ఈ భూ ప్రపంచంపైనే పాలరాతి భవనాలూ వున్నాయి. అతనికి మూడంతస్తుల మేడ వుంది. మేడలో గాలి వుంది. వెలుతురు వుంది. కింద మొజాయిక్ నేలా, గోడలకి వేల రూపాయల ఖరీదు చేసే పెయింటింగులూ, మూల మూలలా పంచలోహ శిల్పాలూ వున్నాయి. మేడముందు విశాలమైన తోట వుంది. జైలు గోడలాంటి ప్రహరీ ద్వారం ముందు శిలావిగ్రహంలాంటి సెంట్రీ వున్నాడు. ఇన్నీ వున్న మనిషి ఇంకా ఏదో కావాలని నేనుండే చోటికి నెలనెలా యమదూతలా రావడమే విచిత్రం.

వచ్చిన మనిషి నానా మాటలంటాడు. నెలల తరబడి పేరుకున్న అద్దె బకాయి ఇంకెప్పుడు చెల్లిస్తావంటాడు. పోలీసు రిపోర్టు ఇస్తానంటాడు. ఇంకేవో అంటాడు. ఇంకేమీ అనలేక మళ్ళీ ఫస్టు తారీకున రావడానికి వెళ్ళిపోతాడు.

నేను మాట్లాడను. అతను మాట్లాడుతున్నంతసేపూ జేవురించిన అతని మొహం వంకా కదులుతున్న పెదవులవంకా వంకర తిరిగిన ముక్కువంకా తదేకంగా చూస్తుండిపోతాను. ఆ ముక్కంటే ఎంతో అసహ్యం నాకు. మూడు వంకలు తిరిగిన ముక్కు అది. గాలి ఎగబీలుస్తున్నప్పుడు ముక్కు పుటాలు తెరుచుకున్న గుహల్లా కన్పిస్తాయి. ఆ ముక్కు లేకపోతే అతనెలా వుంటాడా అని వూహిస్తాను. దాన్ని బలవంతంగా కత్తిరించాలనే కోరిక కలుగుతుంది నాకు. అందుకతను అనుమతి ఇవ్వడు. ప్రపంచంలో ఎంతో మందికి మామూలు ముక్కుంటే అతనికి మాత్రమే మూడు వంకర్లు తిరిగిన ముక్కు ఎందుకుండాలో అర్థం కాదు.

మనిషిని వూపిరాడకుండా వుక్కిరిబిక్కిరి చేసేది ఇల్లు కూడా కావచ్చు. ఈ అద్దె కొంప కోసం ఎంత బ్రహ్మప్రయత్నం చేశాను? ఇంటిముందు వీధీల కిందుగా రాత్రింబగళ్లు పంది గురగుర లాడుతున్నట్టు ప్రవహించే వైతరణి కాల్వ. ఉండుండి, ముక్కులు బద్దలు చేస్తూ తెరలు తెరలుగా మొహాన్ని మొత్తే వాసన. ఇంట్లో కూర్చుని బయట పగలో రాత్రో చెప్పలేని పరిస్థితి. చితచితలాడే నేల. రాత్రి పడగానే ఇనప ముక్కుల్తో శరీరంమీదకి దాడిచేసే జోరీగల్లాంటి దోమలు. అయినా ఆ యింటికీ, ఇంట్లో పాతకుక్కి మంచానికీ, మంచంమీద కళ్ళు తెరుచుకుని దోమలు తూట్లు పొడుస్తున్నా కదలకుండా గంటలతరబడి పై కప్పు వంకే చూస్తూ గడపడానికీ అలవాటుపడ్డాను. అయినా ఒకే ప్రపంచంలో నేనుండే యమలోకం, మా యింటి యజమాని నివసించే దేవేంద్ర భవనమూ ఎలా సామరస్యంగా మనగలుగుతున్నాయో నా కర్థం కాదు. నాకర్థం కాని విషయాలెన్నో వున్నాయి.

** ** ** **

ఎక్కడికో ఎందుకో నడుస్తూ వెళుతున్నాను. రోడ్డు మీద ఎందరో మనుషులు—మాట్లాడుకుంటూ, నడుస్తూ, పరిగెత్తుతూ. ఎవరో తరుము తున్నట్టు, ఏదో యంత్రంలో పనిముట్లలా, ఏదో మహాశక్తి వెనక నుంచి తోస్తున్నట్టు కదుల్తున్నారు. రొదచేస్తూ పరిగెత్తే వాహనాలు. గోడల నిండా రక రకాల భంగిమల వాల్ పోస్టర్లు, పేవ్‌మెంటు మీద జనం దృష్టిని తమవైపు మళ్లించడానికి ఉన్న అవయవాలు కదిలిస్తూ అరుస్తున్న బిచ్చగాళ్ళు. లోకమంతా నిజంగా కదులుతున్నట్టు భ్రమ కలుగుతోంది.

" హాయ్!"

తల తిప్పి చూశాను. ఒకప్పటి నా క్లాస్‌మేట్ ప్రసాద్.

"ఎందాకా?"

"ఏమో."

"అలా నాతోపాటు రాకూడదూ?"

తల వూపాను. తన స్కూటర్ మీద కూర్చోబెట్టుకుని బయలుదేరాడు. స్కూటర్ రెండు మూడు మలుపులు తిరిగి ఒక బార్ ముందు ఆగింది. లోపలికి వెళ్ళి ఇద్దరం ఒక టేబుల్ ముందు కూర్చున్నాం.

"హమ్మయ్య ఇక్కడికొస్తే ప్రాణం లేచొస్తుంది" అన్నాడు ప్రసాద్.

బయట పగలే అయినా లోపల కనుచీకటి. చీకటిలో చిరుదీపాలు. గోడలనిండా ఆహ్వానించే అర్ధనగ్న పూర్తినగ్న చిత్రాలు. స్టీరియోలో సన్నగా వాకర్థం గాని సంగీతం. నేనెందుకొచ్చానిక్కడికి? పక్క టేబుల్ మీద ఖాళీ ప్లేట్లు చూడగానే మర్చిపోయిన ఆకలి గుర్తుకొచ్చింది.

"ఏం తీసుకుంటావ్?"

"నాకలవాటు లేదు."

"అని తెలుసులే నాకు. కంపెనీ కోసం తీసుకొచ్చానంతే" ఎంతో మామూలుగా అన్నాడు ప్రసాద్.

నాకు లేచిపోవాలనిపించినా అలాగే కూర్చుండిపోయాను. టేబుల్ మీదికి ఏదో బాటిల్, ఐసు, రెండు గ్లాసులు వచ్చాయి. నా ముందు గ్లాసులో కుంకుడు రసం లాంటి ద్రవం. వాసన. ఆ రంగు చూస్తుంటే ప్రశాంతికి వాడిన మందు రంగు గుర్తొచ్చింది. కడుపులో ఏదో దేవినట్టయింది.

"కొంచెం పుచ్చుకో బ్రదర్, ఆరోగ్యానికి మంచిది."

అతను నాకు బ్రదర్ కాదు. నాకెందుకో కసి. అతను ఛీర్స్ చెప్పేలోగానే గ్లాసెత్తిపట్టి రెండు మూడు గుటకలు వేశాను. గొంతు మండుకుపోయింది. అయినా ఆ మంటల్లో కసిలో ఏదో పైశాచిక తృప్తి. ప్రసాద్ ఒక గుటక వేసి నాతో బాతాఖానీ ప్రారంభించాడు.

"తప్పదు బ్రదర్, లైఫ్‌లో ఒక్కసారైనా మందు పుచ్చుకోకుండా చనిపోతే ఎంత ఘోరం? లైఫ్ ఎంజాయ్ చెయ్యాలి. కొంతమంది ప్రతినిత్యం ఏదో సమస్యతో ఛస్తూనే వుంటారు. ఐ పిటీ దెమ్. నేనున్నాను చూడు. ఇప్పటికి బిజినెస్‌లో ఐదు లక్షలు సంపాదించాను. అయినా సంపాదన కాదు ముఖ్యం. ఎంజాయ్‌మెంట్. రెండు రోజులకోసారి ఇలా రాకపోతే వూపిరాడదు నాకు."

టేబుల్ మీదకి తందూరీ చికెన్, ఇంకేవో పదార్థాలు దిగాయి. ఒక ప్లేటుకి పది చిన్న ప్లేట్లు. అతను ఆవురావురు మంటూ తిండి మొదలెట్టాడు. నాకూ ఆకలి రగులుతోంది. ఉదయం ఎప్పుడో చాలీచాలని చద్దన్నం తిన్న గుర్తు. సాయంత్రం వంటకి ఇంట్లో బియ్యం లేవు. లేవని వసంత చెప్పలేక చెప్పింది.

"అలా కూర్చుండి పోయావేం? ఒక్క ముక్క రుచి చూడు. ఈ డిష్ ఒక్కటే యాభై రెండు రూపాయలు. కానియ్ కానియ్. సమస్యలు ఎప్పుడూ వుండేవే. నాకు మాత్రం సమస్యలు లేవా? ఏ బ్రాంచిలో లాభాలు తగ్గుతాయో ఎవడెవడి కాళ్ళా గడ్డాలూ పట్టుకుని ఎక్స్‌పోర్టు ఆర్డర్లు సంపాదించాలో, ఇన్‌కమ్ టాక్స్ వాళ్ళకి చిక్కకుండా ఎలా దాక్కోవాలో అన్నీ సమస్యలే. అయితే మాత్రం అదే దిగులు పెట్టుకుంటే ఎలా? నీ వుద్యోగం పోయిన సంగతి నాకూ తెలిసిందిలే. పోతే పోనీ. బతకలేక పోతావా ఏం? అయినా కేవలం ఆదర్శాలు నమ్ముకుంటే మనం పైకి రాలేమోయ్."

కోడి తొడ ఎముక లాగి చుట్టూవున్న మాంసాన్ని పళ్ళతో పీకుతున్నాడు ప్రసాద్. నాకు ముళ్ల మీద కూర్చున్నట్టుంది. ఏదో ఆడగాలి. లోపల్నుంచి ఎవరో ముందుకి తోస్తున్నారు. ఇక ఆగలేక పోయాను.


"ప్రసాద్, నాకో ఐదు వేలు కావాలి. నీకూ తెలుసుగా. నా కూతురు...."

ప్రసాద్ పెద్దగా నవ్వాడు. దూరంగా కూర్చున్న వాళ్ళు మా వంక విచిత్రంగా చూశారు.

"సారీ బ్రదర్, డబ్బు వుందనుకోవడమే గానీ ఎప్పటికప్పుడు ప్రాబ్లమే. తల ప్రాణం తోక కొస్తుందంటే నమ్ము. ఏం చేస్తాం చెప్పు. ఎవరి ఇబ్బందులు వాళ్ళవి. అయినా నీ కూతురికి తగ్గిపోతుందిలే. నెవర్ మైండ్." అంటూ ఓ పెగ్ పుచ్చుకున్నాడు ప్రసాద్. తర్వాత ప్లేట్లోంచి ఒక ఎముక తీసి లోపలి మజ్జను పీల్చసాగాడు. ఆ శబ్దం నాకెంతో అసహ్యంగా వుంది. నేను పైకి లేచాను వెళ్లిపోవడానికి. అతను చెయ్యిపట్టుకు ఆపాడు.

"అంత తొందరేం? వెళ్లొచ్చులే. ఈ నైట్ వుండి పోరాదూ నాతోపాటు? నీ దిగులు మరిపిస్తా. మరేం లేదు, కంపెనీ కోసం. హోటల్ చార్మినార్‌లో రూం


# తలనొప్పు లెన్నెన్నో



# చికిత్స ఒకటి!

# అనాసిన్

## దీన్లో బాధనివారణశక్తి ఎక్కువగా ఉంది

వెంటనే ఉపశమనం యివ్వడం కోసం అనాసిన్‌లో, ప్రపంచమంతటా డాక్టర్లు ఎక్కువగా సిఫార్సు చేసే బాధానివారక ఔషధాలు మరింత ఎక్కువగా ఉన్నాయి.

తలనొప్పి, జలుబు, పడిశెం, ఫ్లూ, నడుం నొప్పి, కండరాల నొప్పి, పంటి నొప్పి, వీటికోసం బాలా బాగా పనిచేస్తుంది.

కేవలం అనాసిన్ పైనే విశ్వాసం ఉంచండి.

ఇప్పుడు సురక్షితమైన ఫాయిల్ ప్యాకింగ్‌లో.



శక్తివంతమైన మరియు విశ్వసనీయమైన
మేనర్స్
అనాసిన్*

భారతదేశపు నం.1 నొప్పిని నివారించే ఔషధం

* Licensed user of T.M.: Geoffrey Manners & Co. Ltd. GM-2-84 TL

బుక్ చేశాను. కొత్త సరుకులే. రెండువేలు. వచ్చేయ్. నీకూ ఛాన్సిప్పిస్తా.''

నేను చెయ్యి వదిలించుకుని బయట పడ్డాను. కడుపులో ఆకలి మండుతోంది. మరేదో మండుతోంది. టేబుల్ మీద ఖరీదైన పదార్థాలు నా వెనక నవ్వు తున్నట్టుంది.

నేనూ ప్రసాద్ ఒకే భూగోళం మీద ఒక చోటనే బతుకుతున్నాం. ఈ ప్రపంచంలో ఒకే సరళరేఖ మీద గంజి నీళ్ళూ కారపు మెతుకులూ, విస్కీ గ్లాసులూ ఆకలి కాని వాడి ఆకలి తీర్చే తందూరీ వంటకాలూ వున్నాయి.

ఇంటికి చేరేసరికి పొద్దు పోయింది. ఇంటి ముందు బురదలో విశ్రాంతి తీసుకుంటున్న ఊరకుక్క నన్ను చూసి గుర్రు మంది. లోపలికి వెళ్లాను. ప్రశాంతి మంచం మీద కూర్చుని వుంది. నన్ను చూసి నవ్వింది. ఎంత అందమైన వెన్నెల నవ్వు. యుగ యుగాల కుళ్ళూ కశ్మలం క్షాళనం చెయ్యగల నవ్వు. కానీ నాకు సంతోషం కలగలేదు. ప్రశాంతి బతుకుతుందా? మరింత లావెక్కినట్టుంది. ఒళ్లంతా భయం గొల్పే నిగారింపు. కళ్ళు పూడుకుపోతున్నాయి. ఊపిరి తీసుకోవడానికి శ్రమపడుతోంది.

వసంత భోజనానికి లేవమంది. ఎక్కడో బియ్యం అప్పు తెచ్చినట్టుంది. కానీ నా ఆకలి చచ్చిపోయింది. మంచం మీద పడుకుని ముసుకు తన్నాను. మాసిన పక్క ఆ వాసన నన్ను ఎక్కడికో బాల్యపు గుల్లలోకి తీసుకుపోయింది.

**  **  **  **

ఇక్కడ ఆకలి తొలగించడానికి ఆహారం వుంది. రోగం తొలగించడానికి మందులూ, ఆసుపత్రులూ వున్నాయి. నేరం తొలగించడానికి చట్టం వుంది. అన్యాయం తొలగించడానికి న్యాయస్థానం వుంది. కానీ ఇవన్నీ అన్నీ వున్నవాడివి తప్ప కాళ్ల కింద శూన్యం తప్ప ఏమీ లేనివాడిని రక్షించడానికి లేవని న్యాయస్థానం నా విషయంలో మరోసారి నిర్ధారించింది. తీర్పు కాగితం ఇప్పుడు నా చేతుల్లోనే వుంది.

ఉద్యోగం కోసం అర్థించడం న్యాయబద్ధమే గానీ ముందుగా అందుకోసం [illegible]ంచింది పై అధికారులే గానీ నేరుగా న్యాయ స్థానాన్ని కాదని న్యాయస్థానం తీర్పు చెప్పింది. అందుకు నాలుగేళ్లు పట్టింది. అన్ని దారులూ మూసుకున్నదాకా తన వద్దకు రాకూడదని న్యాయస్థానం చెప్పింది. న్యాయస్థానానికీ టెక్నిక్ వుంది.

పరమపద సోపాన పటంలో మళ్ళీ మొదటికే వచ్చాను. తీర్పు కాగితం బరువు నా సమస్తాన్నీ కుంగదీస్తోంది. నేను నడవలేకపోతున్నాను. కదులుతున్న డొల్లలా రోడ్డు మీద ఎక్కడికో తడబడుతూ అడుగులు వేస్తున్నాను. ఆ సమయంలో ఎవరిదో పిలుపు నన్ను పట్టుకొని ఆపకపోతే పడిపోయి వుండే వాణ్ణే. ఆ పిలుపు సుమిత్రది. సుమిత్ర ఒకప్పటి నా కొలీగ్. నా భావాల్ని అర్థం చేసుకున్నది ఆమె ఒక్కతే. ఆమె లేకపోతే ఈ లోకం నాకు మరింత అసహ్యంగా వుండేది.

''ఎక్కడికి వెళుతున్నారు, తలెత్తి కూడా చూడకుండా? అలా వున్నారేమిటి?'' ప్రశ్నించింది సుమిత్ర.

నేను మాట్లాడలేదు. నవ్వడానికి విఫల ప్రయత్నం చేశాను.

''రండి, అలా కూర్చుందాం'' అంటూ పార్కులోకి దారి తీసింది. ఆమె చేతిలో కూరగాయల సంచి కాబోలు వుంది. ఇద్దరం పచ్చిక మీద కూర్చున్నాం. పడమటి దిక్కున సూర్యుడు అస్తమిస్తున్నాడు. సాయంసంధ్య ఎర్రగా భీభత్సంగా వుంది.

''చెప్పండి.''

''ఏం చెప్ప మంటారు?''

''ఏమిటలా వున్నారు?''

నేను నిశ్శబ్దంగా కోర్టు తీర్పు కాగితం సుమిత్ర కందించాను. అంతా చదివి దిగులుగా మౌనంగా వుండిపోయింది కాసేపు.

''ఇలా జరుగుతుందనుకోలేదు నేను. మేమంతా వుండీ ఏమి చెయ్యలేక పోయాం. మా బతుకులు ఏదో ఒకలా వెళ్లమారుతున్నాయి. మీరే అన్యాయమై పోయారు'' అంది చివరికి.

''ఒంటరి వాడికి ఇక్కడ వునికి లేదు'' అన్నాను నేను.

''అవును. డబ్బు, అవినీతి లేనివాడు ఈ చక్రంలో ఒంటరివాడే. అవి ఉన్నవాడికి మరేవీ లేకపోయినా ఫర్వాలేదు'' అంది సుమిత్ర ఎక్కడో చూస్తూ.

ఇంతలో పల్లీలమ్మే కుర్రాడు వచ్చాడు మా యిద్దరి మధ్యకి. నా జేబులో [illegible]






గవ్వ లేదు. సిటి బస్సెక్కబోయి జేబు ఖాళీ అన్న సంగతి గుర్తొచ్చి ఐదు కిలోమీటర్లు నడిచాను అప్పటిదాకా. సుమిత్రే రెండు పొట్లాలు తీసుకుంది.

ఆమెదీ ఒంటరి జీవితమే. ఇంకా పెళ్ళి కాలేదు. చదువుకుంటున్న తమ్ముడు. అవిటి చెల్లెలు. వాళ్ళిద్దరి బతుకులు తనమీదే. అందువల్ల పెళ్ళి చేసుకోవాలనే ఆలోచన కూడా లేదు. పెళ్ళికాని అందగత్తె కావడం చేత తలవంపులు, అవమానాలు. మా ఇద్దరికీ సంబంధం అంట గట్టినవాళ్లూ వున్నారు.

"ఈ మధ్య మా పిన్ని కూతుర్ని ఎవరో బలాత్కారం చేశారు. అవమానానికి తోడు కేసు నిలవలేదు. నిజానికి కేసు పెట్టమని ఒత్తిడి చేసింది నేనే. చివరికి ఆ పిల్ల తలెత్తుకోలేక పోయింది. పోయిన వారమే ఆత్మహత్య చేసుకుంది. ఇలాంటి దౌర్భాగ్యాలెన్నో."

సుమిత్ర ఆగింది, దుఃఖాన్ని ఆపుకోవడానికి.

"కానీ... కానీ మీరైనా నేనైనా ఈ వికృత చట్టాన్ని ప్రశ్నించక తప్పదు. ప్రశ్నకు సమాధానం దొరికే లోగా ఎంతో కోల్పోక తప్పదు. ప్రశ్నే లేనప్పుడు సమాధానమూ వుండదు.... ఇటీవల కొందరం కలిసి 'స్త్రీ విముక్తి సంఘటన' ఏర్పాటు చేశాం. ఓ సారి మా ఆఫీసుకి రండి..... అన్నట్టు ప్రశాంతి కెలావుంది."

"చావుబతుకుల్లో. బతుకుతుందనే ఆశ లేదు. బతికించడానికి తాహతూ లేదు."

సుమిత్ర కన్నుల్లో నీరు. అప్పుడే వెలిగిన ట్యూబులైట్ల వెలుగులో కన్నీరు మెరుస్తోంది. నేనిక అక్కడుండలేక పోయాను. కన్నీటినీ సానుభూతినీ భరించగల శక్తినెప్పుడో కోల్పోయాను. మౌనంగా సెలవు తీసుకుని కదిలాను.

కాళ్ళు నన్ను మోసుకెళుతున్నాయి. మెయిన్ రోడ్డు మీదకి రాగానే ఎవరిదో చావు ఊరేగింపు ఎదురైంది. ఎవరో రాజకీయ నాయకుడు దేశానికి సేవ చేస్తూ మరణించాడు. శవానికి పూల దండలు. సుగంధ ద్రవ్యాలు. శవం అధిరోహించిన కారుకీ అలంకారం. జయ జయధ్వానాలు. ఉప్పెనలా జన సందోహం. ఆ నాయకుడు చేసిన దేశ ద్రోహం మరిచిపోయిన జనసందోహం. ఆత్మ చైతన్యం, స్థితి చైతన్యం కోల్పోయి నడిచే పీనుగులకీ,మరణించిన పీనుగులకీ వీరపూజ చేసే జన సందోహం.

అతి కష్టం మీద జనాన్ని దాటుకుని ఇంటిదారి పట్టాను. కాళ్ళు తేలిపోతున్నాయి. శరీరంలో మనస్సులో మంచులా శూన్యం విస్తరిస్తున్న భావన. వాకిలి గడప తగిలి పడబోయి నిలదొక్కుకున్నాను. ఎదురుగా వెర్రి చూపుల్తో, రేగిన తలతో, కన్నీటి చారికల్తో వసంత. నన్ను చూడగానే పరుగెత్తు కొచ్చి వాటేసుకుని ఏడవ సాగింది. నా మనస్సు కీడు శంకిస్తోంది. మెల్లగా లోపలికి నడిచాము.

పక్కమీద ప్రశాంతి ప్రశాంతంగా నిద్రిస్తోంది. కాదు. మరణించింది.

** ** ** **

"ఆకాశంలో కనిపించే వేమిటి నాన్నా?"

"చుక్కలు పాపా!"

"అవెందుకలా మెరుస్తాయి?"

"చీకటిని పోగొట్టడానికి."

"మరి మన చుట్టూ ఎందుకింత చీకటి వుంది?"

".........."

"నాన్నా, ఆ చుక్కలన్నీ నేం మీద కొస్తే ఎంతో బాగుంటుంది. అప్పుడు చీకటంతా పోతుంది. పగలూ రాత్రీ ఎంచక్కా ఆడుకోవచ్చు."

ఎప్పుడో నా కూతురు అన్న మాటలు గుర్తు కొస్తున్నాయి. దాని తెల్లటి ముద్దు మొహం, తళ తళ మెరిసే కళ్ళు, కుళ్ళు, ద్వేషం తెలీని నవ్వు—అన్నీ గుర్తు కొస్తున్నాయి. కానీ నా కళ్ళ వెంట కన్నీళ్ళు రాలడంలేదు. ఏడవగల శక్తిని నేనెప్పుడో కోల్పోయాను. ఏదో రగులుతోంది నాలో. ఏదో నా సమస్తాన్నీ అగ్ని సరస్సులో ముంచి తేలుస్తోంది.

ఇక్కడ నేనేమిటి? జీవన్మరణాల మధ్య ఉనికి కర్థం ఏమిటి? ఊపిరి సలపకుండా ఇనప హస్తంతో నన్ను బిగించి పట్టుకున్న వికృత శక్తి ఏమిటి? ఇంకి పోయిన కన్నీరెక్కడిది? ఆవిరైన నెత్తురెక్కడిది? ఒకే సరళరేఖపై ఒక బిందువు పై రాక్షస క్రౌర్యమూ మరో బిందువుపై రగిలే విషాదమూ ఎక్కడివి?

బయటికి నడిచాను. ఆకాశంలో మబ్బు ల్లేవు. బహుశ పంచమి వెన్నెల. అక్కడక్కడ మినుకు మినుకున మెరిసే నక్షత్రాలు. నిర్మల నక్షత్రాల కింద నికృష్టమైన చీకటి. మనిషిని మింగేసే చీకటి. చీకటిలో తడిసే వెన్నెల. చీకటి ఆయువెక్కడ? చీకటి తల్లి వేరెక్కడ?